క్లుప్తంగా

అరుణోదయ రామారావు సేవలు మరువలేనివి



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పాటల రూపంలో సమాజాన్ని మేల్కొల్పిన అరుణోదయ రామారావు సేవలు మరువలేమని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని స్థానిక లాల్‌బంగ్లాలో అరుణోదయ సంస్థ ఆధ్వర్యంలో అరుణోదయ రామారావు 5వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నరసింహారావు, వీరబాబు, మైసయ్య, కొండలు, సలీం, రవితేజ, నగేష్, నరసింహారావు, గోపి, సురేష్ ఉన్నారు.

కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న నేరేడుచర్ల వాసవి, వనితా క్లబ్‌లు సభ్యులు

నేరేడుచర్ల : చేతి పని శుభ్రత, మంత్రసాని దినోత్సవం, ప్రముఖ వ్యాపార వేత్త మిర్యాల ప్రసాద్–శోభల పెళ్లి రోజు సందర్భంగా సోమవారం నేరేడుచర్లలో వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, మంత్రసానులను సన్మానించారు. స్థానిక చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, జోన్ చైర్మన్ లక్ష్మీనర్సింహారావు, వనిత క్లబ్ అధ్యక్షురాలు గరిణె జ్యోతి, రేపాల ఊర్మిళ, ఊట్కూరు నటరాజ్, పాల్వాయి గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, రాము, మధు, వాసు, వెంకన్న, అనిల్ తదితరులున్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

మునగాల: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బహుజన సమాజ్ పార్టీ కోదాడ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కత్తి నాగబాబు కోరారు. సోమవారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా గ్రామసభల ద్వారా పంచాయతీ కార్యదర్శులే ఎంపిక చేయయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూర్‌నగర్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న సంఘటన సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం కల్వపల్లి గ్రామానికి చెందిన గోపలాదాసు నరేందర్ తన ట్రాక్టర్‌తో కల్వపల్లి వాగు నుంచి ఇసుకను హుజూర్‌నగర్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నాడు. సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా మేడే వారోత్సవాలు

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లిలో సోమవారం మేడే వారోత్సవాల్లో భాగంగా సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ, హమాలీ, పంచాయతీ కార్మిక సంఘం, నాయకులు, కార్మికులు ర్యాలీ నిర్వహించి ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రన్‌మియా, దేవదానం, గురువారెడ్డి ,సైదా, వీరారెడ్డి, నాగరాజు, వీరస్వామి, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, రవి, ప్రతాపరెడ్డి, బాలశౌరి పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలి

కోదాడరూరల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు సట్టు నర్సింహారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమ్మెలో ఐఎన్‌టీయూసీతోపాటు సెంట్రల్ ట్రేడ్ యూనియన్‌లు, బ్యాంకింగ్, బీమా, అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

కోదాడరూరల్ : మండల పరిధిలోని అశోక్‌నగర్‌లో గల మానసిక దివ్యాంగుల కేంద్రంలో సోమవారం ఏఐవైఎఫ్ చిలుకూరు మండల అధ్యక్షుడు అనంతుల రాము–ఉషా దంపతుల కుమార్తె చెన్విత పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు అప్పగించేదెప్పుడో!

- కోదాడ పరిధిలోని బాలాజీనగర్‌లో 560 ఇళ్లు నిర్మాణం
- లబ్ధిదారులకు ఎంపిక చేసి కేటాయించని అధికారులు
- ధ్వంసమవుతున్న కిటికీలు, అద్దాలు, తలుపులు
- ఖాళీగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఇళ్లు




బాలాజీనగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం, కొన్ని గదులకు పగిలిన కిటికీ అద్దాలు

కోదాడరూరల్: కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిరుపయోగంగా మారాయి. ఎనిమిదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.32.54 కోట్ల వ్యయంతో జీ ప్లస్ టూ పద్ధతిలో 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టగా పనులు ఆగుతూ సాగుతూ ఆరేళ్లకు పూర్తయ్యాయి. ఆ తర్వాత లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి 2023 ఆగస్టు 9న పట్టాలను పంపిణీ చేసి గృహప్రవేశ కార్యక్రమం కూడా నిర్వహించారు. అయితే మౌలిక వసతుల పనులు మొత్తం పూర్తయిన తర్వాత ఇళ్లను కేటాయిస్తామని నాటినుంచి అధికారులు వాయిదా వేస్తున్నారు.

పూర్తికాని మౌలిక వసతుల పనులు

భారీ గృహసముదాయం కావడంతో అక్కడ ఉండే కుటుంబాలకు కావాల్సిన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాల్సి ఉంటుంది. డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించారు కానీ విద్యుత్, మంచినీటి వసతులు కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్‌లు ఇస్తున్నారు. మంచి నీటి వసతులు కూడా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పట్టణ శివారులో ఉండడంతో..

బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పట్టణ శివారులో ఉండడంతో అటువైపు పెద్దగా ఎవరు వెళ్లరు. దీంతో అవి అసాంఘిక కార్యకలపాలకు నిలయంగా మారాయి. పగలు రాత్రి తేడాలేకుండా మందుబాబులు అక్కడకు మద్యాన్ని తెచ్చుకొని తాగుతున్నారు. ఖాళీ సీసాలను సైతం అక్కడే పడేసి వెళ్తున్నారు. ఈ క్రమంలో అల్లరిమూకలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గ్రౌడ్ ఫ్లోర్‌లోని దాదాపుగా అన్ని ఇళ్ల గదులకు వేసిన తలుపులు, తాళాలను, కిటికీలను పగలకొట్టి ధ్వంసం చేశారు. రెండో ఫ్లోర్‌లోని పలు ఇళ్ల తలుపులను పగలకొట్టి తమ సాంఘిం కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. ఈ ఇళ్లను తమకు కేటాయించడం ఆలస్యం చేస్తే శిథిలావస్థకు చేరతాయని, ఇప్పటికైనా కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

వసతులు పూర్తికాగానే కేటాయిస్తాం



బాలాజీనగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. అక్కడ విద్యుత్ సరఫరా, నీటి వసతికి సంబంధించిన పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు కేటాయిస్తాం.

– సూర్యనారాయణ, ఆర్డీఓ, కోదాడ

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవు



మైనర్లకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

కోదాడరూరల్ : మైనర్‌లు వాహనాలు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తీసుకోక తప్పదని కోదాడ పట్టణ సీఐ కె.శివశంకర్ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన 16 మంది మైనర్‌లు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి మాట్లాడారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా అనుకోని ప్రమాదం చోటుచేసుకుంటే మీరే బాధ్యులు అవుతారని తెలిపారు. మైనర్లు చదువుపై దృష్టిపెట్టాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తు ఉండాలని సూచించారు. కార్య క్రమంలో ఎస్‌ఐ సుధీర్, ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

నడిగూడెం : సైబర్ నేరగాళ్ల విషయంలో గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోతె పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మోతె మండలం కాగితరామచంద్రాపురంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లు చేసి, ఓటీపీలు చెప్పవద్దని, ఎలాంటి వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటుకావద్దన్నారు. బెట్టింగ్ ప్రకటనలు నమ్మవద్దన్నారు. అనంతరం పలువురు పోలీసు కళాకారులు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై ఆట, పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రతాపరెడ్డి, మహిళా కానిస్టేబుల్ చందన, హోం గార్డు ఎ.శ్రీనివాస్, షీ టీం మహిళా హెడ్ కానిస్టేబల్ కవిత, సాయి జ్యోతి, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, గోపయ్య, చారి, గురులింగం, కృష్ణ, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



జాన్‌పహాడ్ నుంచి వెళ్తున్న మట్టి టిప్పర్

పాలకవీడు: ప్రభుత్వ అనుమతులు లేకుండా కొందరు వ్యాపారులు చెరువు మట్టిని అక్రమంగా తరలించుకెళ్తున్నారు. ఈ తతంగం పాలకవీడు మండల జాన్‌పహాడ్‌లో కొనసాగుతున్నా అధికారుల పర్యవేక్షణ కరువైంది. వివరాల్లోకి వెళితే.. గతేడాది వేసవి సీజన్‌లో మండలంలోని జాన్‌పహాడ్ చెరువు నుంచి పొలాల్లో పోసుకునేందుకు రైతులకు అనుమతించారు. ఆ సమయంలో కొందరు రైతులు తమ పొలాలకు నల్లమట్టి తోలుకున్నారు. ఇదే అదునుగా కొందరు ఇటుక బట్టీ వ్యాపారులు చెరువు మట్టిని పొలాలకని తీసుకొచ్చి రైతుల భూముల్లో నిల్వ చేసుకున్నారు. దానిని ప్రస్తుతం భారీ యంత్రాలు, టిప్పర్ల ద్వారా జాన్‌పహాడ్ నుంచి నేరేడుచర్లలోని ఇటుక బట్టీలకు శని, ఆదివారాల్లో తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ రవాణాను అధికారులు అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య



నేరేడుచర్ల : కరపత్రం విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ తదితరులు



చిలుకూరు : బడిబాట ర్యాలీలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

నేరేడుచర్ల : ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, ఇంటర్ ఫలితాలతో కూడిన కరపత్రాన్ని సోమవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు మోజులో పడి అధిక ఫీజులు చెల్లించి నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు, శ్రీనివాసులు, వెంకన్న, ప్రణతి, నర్సింహాచారి, సునీత, గణేష్, నరేందర్, అపర్ణ, విరేష్ తదితరులున్నారు.

నారాయణపురంలో బడిబాట

చిలుకూరు: మండలంలోని నారాయణపురంలో జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు సోమవారం గ్రామస్తులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గుజ్జుల నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



మునగాల: బీజేపీ మునగాల మండల శాఖ అధ్యక్షుడిగా మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన మైలార్‌శెట్టి నాగేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి నియామక పత్రాన్ని నాగేశ్వరరావుకు అందజేశారు. ప్రస్తుతం నాగేశ్వరరావు బీజేపీ కిసాన్ మోర్చా మండల శాఖ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. తనను మండల శాఖ అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షురాలు, నాయకులకు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రైతులకు వీడియో కాన్ఫరెన్స్

మునగాల: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు జరిగే శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతునేస్తం (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తన నాణ్యత, మొలక శాతం పరీక్ష చేసే విధానం అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో ఎంఈఓ నారాయణరెడ్డి, పాఠశాల సిబ్బంది

నేరేడుచర్ల: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నేరేడుచర్ల ఎంఈఓ పుట్లూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల పీఎంశ్రీ యోజన కింద ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి సెలవులు సద్వినియోగమయ్యేలా వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మట్టు మధు, పీడీ ఎం యాదగిరి, ఉపాధ్యాయులు బాలు, సైదులు, లాల్‌సాహెబ్, శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రామిశెట్టి బ్రహ్మం సేవలు ఎనలేనివి



రామిశెట్టి బ్రహ్మం చిత్ర పటం వద్ద నివాళులర్పించిన సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన సీపీఐ నాయకులు, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ రామిశెట్టి బ్రహ్మం సేవలు ఎనలేనివని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలో రామిశెట్టి బ్రహ్మం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్మికులు, పేద ప్రజల సమస్యలపై బ్రహ్మం చేసిన ప్రజా పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి జక్కుల రమేష్, నాయకులు సోమగాని కృష్ణ, జడ వెంకన్న, జక్కుల శ్రీను, సురేందర్, మురళి, వీర నారాయణ, మామిడి నర్సయ్య, నర్సింహారావు, రమేష్, వెంకటేశ్వర్లు, కాశయ్య పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ ఇవ్వాలి



ఎస్టీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కోదాడరూరల్ : ఉద్యోగ్య, ఉపాధ్యాయుడులకు సీనియారిటీ ప్రకారం రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ ఇవ్వాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చుండూరు ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎస్టీఓ కార్యాలయం ఎదుట రిటైర్‌మెంట్ పొంది బెన్‌ఫిట్స్ అందకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసి కుటుంబ బాధ్యతలు, అనారోగ్యాలతో బాధపడుతున్న రిటైర్డ్ ఉద్యోగులకు బెన్‌ఫిట్స్ అందక ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా బెన్‌ఫిట్స్ కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం నేటికి మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. అనంతర ం ఎస్టీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టాప్రా సంఘం డివిజన్ అధ్యక్షుడు శివరామయ్య, రిటైర్డ్ ఉద్యోగులు గోవిందరావు, మేకల సుధాకర్‌రావు, తెల్లాకుల నాగేశ్వరరావు, గోపి, నరసింహారావు, కృష్ణవేణి, టీపీటీఎఫ్ నాయకులు భిక్షం ఉన్నారు.

పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ప్రవేశ పరీక్ష

సూర్యాపేటటౌన్ : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలను టీఎస్ యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చుక్కా రామయ్య సౌజన్యంతో పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో నిరుపేద, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణ భారతి, జిల్లా కోశాధికారి వెంకటయ్య, పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ పర్యవేక్షకుడు సుఖదేవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

అసంపూర్తిగా వదిలేశారు!



మోతెలో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం



రావిపహాడ్‌లో స్లాబ్ వేసి వదిలేచిన భవనం

- మోతె మండలంలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు అస్తవ్యస్తం
- ఏడేళ్లుగా కొనసాగుతున్న పనులు
- బిల్లులు మంజూరు కాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

మోతె: మండలంలోని పలు గ్రామాల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి లక్షణంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఆయా భవనాలు కొన్ని చోట్ల పనులు పూర్తయి, మరికొన్ని చోట్ల అసంపూర్తిగా మిగిలిపోయాయి. అయితే మోతె మండల పరిధిలో మోతె, సిరికొండ రెండు సెక్టార్లుగా ఉండగా ఇందులో మోతె సెక్టార్ పరిధిలో 28, సిరికొండ సెక్టార్ పరిధిలో 26 కేంద్రాలతో మొత్తం 54 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిల్లో కొన్నింటికి సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే కేంద్రాలు కొనసాగుతున్నాయి. దీంతో గత ప్రభుత్వం 2018లో 15 కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించింది.

కొన్నిచోట్ల అసంపూర్తిగా..

నూతన భవనాల పనులు చేపట్టగా కొన్నిచోట్ల పూర్తికాగా మరికొన్నిచోట్ల అసంపూర్తిగానే మిగిలిపోయాయి. పూర్తయిన భవనాలకు పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు కాక ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. ఏడేళ్ల నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. మిగతా పనులను వదిలేశారు. ఇదిలా ఉంటే పూర్తయిన, అసంపూర్తిగా ఉన్న భవనాల్లో స్థానికులు పశువులు కట్టేసుకుంటున్నారు. కొన్నిచోట్ల నివాసాలుగా మార్చుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తయిన వాటిని వినియోగంలోకి తేవాలని, అసంపూర్తి వాటిని ఈ వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దేశం నుంచి బహిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నడిగూడెం: భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ పౌరులను దేశం నుంచి బహిష్కరించాలని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నడిగూడెంలో డీటీ ప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బందారు వీరబాబు, ఉపాధ్యక్షుడు మూల భిక్షంరెడ్డి, నాయకులు చిలికేశ్వరపు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలు కలిసికట్టుగా పనులు చేసుకోవాలి



వేణారెడ్డిని సన్మానిస్తున్న హమాలీలు

భానుపురి : బిహార్ హమాలీలు స్థానిక హమాలీలు, వ్యాపారులతో కలిసికట్టుగా ఉండి పనులు చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బిహార్ హమాలీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి 300 మంది హమాలీలు వచ్చి ఐకేపీలు, రైస్ మిల్లులు, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం హమాలీలు వేణారెడ్డిని గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యండీ. అంజద్ అలీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడ్గుల నవీన్, మార్కెట్ హమాలీ సంఘం మేస్త్రీ రమేష్ శర్మ, రూదల్, మనోజ్, మక్కాం తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపులు నిరుపయోగం



రఘునాథపాలెంలో పనిచేయని చేతిపంపు



లాలితండాలో మరమ్మతుకు గురైన చేతిపంపు

- మఠంపల్లి మండలంలో 150కిపైగా పనిచేయని చేతిపంపులు
- మరమ్మతులకు నిధుల్లేవంటున్న అధికారులు, కార్యదర్శులు
- వేసవి దృష్ట్యా వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు

మఠంపల్లి: మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో సుమారు 150కిపైగా చేతిపంపులు పనిచేయకుండా నిరుపయోగంగా మారాయి. ఆయా గ్రామాల ప్రజలు వాటిని మరమ్మతులు చేయాలని గ్రామాల్లో ప్రత్యేకాధికారులను, కార్యదర్శులు కోరుతున్నా.. నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్నారు. గ్రామాల్లో చేతిపంపులు ఉండి కూడా నీరందించని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం వేసవి కావడంతో తమ గ్రామాల్లో మంచినీటి ఎద్దడిని నివారించలేని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు కరువు

ముఖ్యంగా లాలితండా, కొత్తతండా, దొనబండతండా, బీల్యానాయక్‌తండా, తుమ్మలతండా, రఘునాథపాలెం, రామచంద్రాపురంతండా, గుర్రంబోడు తండా, మంచ్యాతండా, పెదవీడు తదితర గ్రామాల్లో కొన్ని నెలల నుంచి చేతిపంపులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. నిధుల లేమితో చేతిపంపుల నిర్వహణ పట్టించుకోవడం లేదు. అయితే పదిరోజుల క్రితం వరకు సాగర్ ఎడమ కాలువ నీటిని విడుదల చేయడంతో గ్రామాల్లో భూగర్భ జలాలు కాస్త పెరిగి వ్యవసాయ బావులు, ఇళ్లలోని బోర్లలో మంచినీరు లభ్యమైంది. ప్రస్తుతం సాగర్‌నీరు నిలుపుదల చేయడంతో బావులు, బోర్లలో నీరు అడుగంటిందని, చేతిపంపులనైనా మరమ్మతులు చేసి నీటి సమస్య తీర్చాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం..

మరమ్మతులకు గురైన చేతిపంపులను బాగు చేయించాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులు కూడా తెలిపాం. నీటి సమస్య ఉన్నచోట వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

– జగదీష్‌కుమార్, మఠంపల్లి ఎంపీడీఓ

చేతిపంపులు బాగుచేయాలి



మండువేసవి కావడంతో గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మంచినీటి ఎద్దడి జఠిలం కాకముందే చేతిపంపులు బాగు చేయించాలి.

– ఎస్‌కె జమీల్ రఘునాథపాలెం

నెలల తరబడి మరమ్మతుల్లేవు



గ్రామాల్లో పనిచేయని చేతిపంపులను నెలల తరబడిగా మరమ్మతులు చేయించడం లేదు. అడిగితే నిధుల లేమి అంటున్నారు. అధికారులు వేసవి కాలం దృష్ట్యా చేతిపంపులను మరమ్మతులు చేయించాలి.

– బాలునాయక్, లాలితండా